క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా పలువురు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మినీబైపాస్‌రోడ్డులోని ఆదాల కార్యాలయంలో నరసింహారెడ్డి, అనిత తదితరులు వారి మిత్రబృందంతో కలిసి ఆదాల హిమబిందు, కొండ్రెడ్డి భరత్‌కుమార్ తదితరుల సమక్షంలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి లంక రామశివారెడ్డి, నగర ఉపాధ్యక్షుడు వేలూరు శ్రీధర్‌రెడ్డి, కల్లూరు లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం



ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

నెల్లూరు సిటీ: ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి రావు శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని 20వ డివిజన్ వనంతోపుసెంటర్, నందవనం, హరేక్రిష్ణనగర్, పెద్దబావి సెంటర్, స్నేహానగర్, ఎస్టీకాలనీ తదితర ప్రాంతాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా కార్యదర్శి పోతురాజు రమాదేవి, నాయకులు రాజారెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, సరళమ్మ, రఘురామయ్య, అబ్రహం, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి రైతు మృతి

అనుమసముద్రంపేట: విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతిచెందిన ఘటన ఏఎస్‌పేట మండలంలోని శ్రీకొలను గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్సై ప్రసాద్‌రెడ్డి బుధవారం వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన పోలిశెట్టి కామయ్య (50)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కామయ్య పొలానికి నీరు పెట్టేందుకు చేను వద్దకు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఎగ్జిట్ ఫీజు కాలిపోవడంతో వాటిని సరిచేసేందుకు కమ్ములపై ఎక్కి తగిలిస్తున్న క్రమంలో 11 కేవీ విద్యుత్ వైరు పొరపాటున తగిలి షాక్‌కు గురై పడిపోయాడు. చుట్టుపక్కల వారు చూసి ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రసాద్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు.

తల్లీకుమారుడి మృతి

సంగం : మండలంలోని దువ్వూరులో ఓ ఇంట్లో తల్లి, కుమారుడు రెండు రోజుల క్రితం మృతిచెందగా ఆలస్యంగా బుధవారం వెలుగుచూసింది. స్థానికులు వివరాల మేరకు.. దువ్వూరుకు చెందిన రమణమ్మ (80), ఆమె కుమారుడు శ్రీనివాసులురెడ్డి (60) ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. శ్రీనివాసులు అవివాహితుడు కావడంతో తల్లి వద్దనే ఉంటున్నాడు. కాగా రమణమ్మ పక్షవాతంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి నుంచి వారు ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో స్థానికులు మంగళవారం రాత్రి ఇంటి తలుపు చూసి చూడగా మృతిచెంది ఉన్నారు. దీంతో దూరప్రాంతాల్లో ఉన్న రమణమ్మ కుమార్తెకు సమాచారం ఇచ్చి బుధవారం ఇరువురిని ఖననం చేశారు. పక్షవాతంతో బాధపడుతున్న రమణమ్మ, ఆమె కుమారుడు శ్రీనివాసులురెడ్డి ఒకేసారి వడదెబ్బతో మృతిచెంది ఉంటారని స్థానికులు చెబుతున్నారు.

ఉదయగిరిలో భారీ వర్షం



ఉదయగిరి: వర్షానికి నేల వాలిన వరిపంట

ఉదయగిరి/వరికుంటపాడు: ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడు, దుత్తలూరు, సీతారామపురం, వింజమూరు, కలిగిరి మండలాల్లో మంగళవారం రాత్రి నుంచి వేకువజాము వరకు భారీ వర్షం కురిసింది. ఉదయగిరి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని ఉదయగిరిలో 79.6, వరికుంటపాడు 90, సీతారామపురం 74.2, దుత్తలూరు 102.0 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్షానికి వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి. దుత్తలూరు, వింజమూరు మండలాల్లోని కొన్ని చెరువుల్లో నీరు చేరింది. గండిపాళెం జలాశయంలో సుమారు రెండు అడుగుల మేర వర్షపు నీరు చేరింది. ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షంతో కొన్నిచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. వింజమూరులో మొక్కజొన్న, అరటి తోటలకు స్వల్ప నష్టం చేకూరింది. వరికుంటపాడు మండలం కొండ్రాజుపల్లిలో సుమారు 40 ఎకరాల్లోని మినుము పంటకు నష్టం వాటిల్లింది.

11వ తేదీ వరకే ప్రచారానికి అనుమతి



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్



పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు

- జిల్లా ఎన్నికల అధికారి ఎం.హరినారాయణన్

నెల్లూరు(బారకాసు): ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకే అనుమతి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్‌కు 48 గంటల ముందు భారత ఎన్నికల సంఘం పేర్కొన్న అన్ని నిబంధనలను రాజకీయ పార్టీల అభ్యర్థులు తప్పకుండా పాటించాలన్నారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ప్రచారానికి అనుమతి ఉంటుందని, ఆ తరువాత మైకులు, జనం లేకుండా కేవలం నలుగురితో మాత్రమే ఇంటింటికీ వెళ్లి సైలెంట్‌గా ప్రచారం చేసుకోవాలన్నారు. బయటి నియోజకవర్గాల నుంచి వచ్చిన వారు జిల్లాను విడిచివెళ్లాలని, అన్ని కల్యాణ మండపాలు, లాడ్జీల్లో ముమ్మరంగా తనిఖీలు చేపడతామని తెలిపారు. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల్లో ఎలాంటి ప్రకటనలు ఇవ్వకూడదని, పత్రికల్లో మాత్రం ముందస్తుగా అనుమతి పొంది ప్రకటనలు ఇవ్వవచ్చని తెలిపారు. పోలింగ్ ఏజెంట్ పోలింగ్ జరుగుతున్న సమయంలో ఓటరు జాబితాను తీసుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు రావడానికి వీలు లేదన్నారు. జిల్లాలో ఓటరు స్లిప్పుల పంపిణీ దాదాపుగా పూర్తయిందని, ఈ నెల 7వ తేదీ నాటికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా 19,542 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. ఇంకా 566 మంది వినియోగించుకోవాల్సి ఉందని తెలిపారు. గురువారం కూడా అన్ని ఆర్వో కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లు పనిచేస్తాయని, ఇంకా పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయని వారు వినియోగించుకోవాలన్నారు. అలాగే బుధవారం నుంచి రెండో విడతలో 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల అనుమతి మేరకు వారి ఇంటి వద్దకే వెళ్లి అధికారులు ఓటు సేకరించే కార్యక్రమం కూడా ప్రారంభమైందని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాన్ని అత్యంత పారదర్శకంగా చేపడుతున్నామని, అలాగే జిల్లా యంత్రాంగం చేపడుతున్న అన్ని కార్యక్రమాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వాములు కావాలని తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ లవన్న, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి విజయ్, టీడీపీ, కాంగ్రెస్ ప్రతినిధులు రసూల్, హరికృష్ణ, బాలసుధాకర్, ఎన్నికల సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుది మోసపూరిత మేనిఫెస్టో



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ హనోక్

నెల్లూరు(దర్గామిట్ట): చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో మోసపూరితమైనదని వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ హనోక్ పేర్కొన్నారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని, మళ్లీ ఇప్పుడు అమలుకు వీలుకాని హామీలను మేనిఫెస్టోలో పొందుపరిచి ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. నిస్వార్థంగా సేవలందించిన వలంటీర్లపై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేనలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఏసునాయుడు, కృష్ణారెడ్డి, సాల్మాన్, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ టాపర్స్‌గా కృష్ణచైతన్య పీజీ విద్యార్థులు



విద్యార్థినులను అభినందిస్తున్న డైరెక్టర్

నెల్లూరు(అర్బన్): తమ కళాశాలకు చెందిన విద్యార్థులు విక్రమ సింహపురి యూనివర్సిటీ విడుదల చేసిన పీజీ రెండో సెమిస్టర్ ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించి టాపర్లుగా నిలిచారని కృష్ణచైతన్య పీజీ కళాశాల డైరెక్టర్లు ఆర్వీ కృష్ణారెడ్డి, రానా ప్రమోద్‌రెడ్డి తెలిపారు. టాపర్లుగా నిలిచిన విద్యార్థులను బుధవారం నగరంలోని ఆ కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీ విడుదల చేసిన పీజీ ఆర్గానిక్ కెమిస్ట్రీ ఫలితాల్లో తమ విద్యార్థిని కె.జ్ఞానదీపిక 90 శాతం మార్కులు సాధించి యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. శ్రావణి అనే విద్యార్థిని 87 శాతం మార్కులతో వర్సిటీ స్థాయిలో రెండో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఇలా అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి తమ కళాశాలలో నిర్వహిస్తున్న క్లాస్‌రూమ్ సెమినార్స్, అకడమిక్ షెడ్యూల్, గెస్ట్ లెక్చరర్స్ టీచింగ్ దోహదపడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డీన్ జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్రమ రవాణా కట్టడికి చర్యలు



కారులోని బ్యాగ్‌ను తనిఖీ చేస్తున్న ఎస్సై లతీఫున్నీసా

నెల్లూరు(క్రైమ్): నగదు, మద్యం, ఇతర ప్రలోభాలకు గురిచేసే వస్తువుల అక్రమ రవాణా కట్టడే లక్ష్యంగా పోలీసు, సెబ్ అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా చెక్‌పోస్టులతోపాటు అన్ని ప్రధాన కూడళ్లలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి జిల్లావ్యాప్తంగా సుమారు రూ.2.70 కోట్ల నగదు పట్టుబడగా, 19 వేల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై 32కు పైగా కేసులు నమోదు చేశారు. ఈ నెల 13న ఎన్నికలు జరగనుండడంతో తనిఖీలు మరింత ముమ్మరం చేశారు. బుధవారం కావలి రెండో పట్టణ పరిధిలో రూ.1.01 లక్షలు, కొడవలూరు పరిధిలో రూ.1.50 లక్షల నగదు ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చేజర్లలో రూ.58,560 విలువ చేసే టీడీపీ కరపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అల్లూరులో 11, సెబ్ అధికారులు 197 మద్యం బాటిళ్లను సీజ్ చేసి నిందితులపై కేసులు నమోదు చేశారు. 1300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

ఓటమి భయంతోనే మహిళలపై దాడులు



మాట్లాడుతున్న మొయిళ్ల గౌరి

నెల్లూరు(బారకాసు): సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఓటమి ఖాయమని తెలుసుకున్న ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఫ్రస్టేషన్‌లో మహిళలపై దాడులు చేయిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి మండిపడ్డారు. నెల్లూరులో బుధవారం ఆమె మాట్లాడుతూ చంద్రబాబుకు ఓటమి కళ్ల ముందే కనిపిస్తోందని, దీంతో ఆయన ఉన్మాదిలా మారిపోయారని దుయ్యబట్టారు. హోంమంత్రి తానేటి వనితపై దాడి, అలాగే విజయవాడలో మహిళలపై బోండా ఉమ అనుచరుల దాడులు, అటు బనగానపల్లిలో కూడా టీడీపీ నాయకుల దాడులు చూస్తే.. చంద్రబాబు ఎలాంటి వాడో మరొక్కసారి రాష్ట్ర ప్రజలకు అర్థమవుతోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అండగా ఉన్నారని, అలాగే అక్కచెల్లెమ్మలు కూడా జగనన్న అండగా నిలుస్తున్నారని తెలిపారు. చంద్రబాబు ఇచ్చిన బూటకపు హామీలను తిప్పికొడుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయడానికి మహిళా లోకం సిద్ధంగా ఉందన్నారు. మహిళలపై జరిగిన దాడుల వెనుక చంద్రబాబే ఉన్నారనేది స్పష్టంగా అర్థమవుతోందన్నారు.

ధైర్యంగా ఓటు వేయండి



ఆదూరుపల్లిలో మార్చ్ ఫాస్ట్

చేజర్ల : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని చేజర్ల ఎస్సై ప్రభాకర్ అన్నారు. మండలంలోని ఆదూరుపల్లి, నెర్నూరు, కొల్లపనాయుడుపల్లి, టికే పాడు, పెరుమాళ్లపాడు గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి ఆయన బుధవారం మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈనెల 13వ తేదీన సోమవారం ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేయాలని కోరారు.

నేడు కూడా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు అవకాశం

నెల్లూరు (దర్గామిట్ట): భారత ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో గురువారం కూడా ఫెసిలిటేషన్ కేంద్రాలు పనిచేస్తాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకోని వారు ఆర్‌ఓ కార్యాలయాల్లోని ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులకు సమాచారం తెలపాలని అధికారులకు సూచించారు.

పేదలకు అన్నదానం



నెల్లూరు(బృందావనం): నగరంలోని ట్రంక్ రోడ్డు గాంధీబొమ్మ సమీపంలో ఉన్న స్వతంత్ర పార్కు వద్ద పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు మాట్లాడుతూ కె.నందకృష్ణాచారి, లక్ష్మీదేవి తమ కుమారుడు నాగప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎం.ప్రభాకర్‌నాయుడు, పి.శ్రీరామరాజు, రఘునాథరెడ్డి, రఫీ, బి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సేవా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని వేదాయపాళెంలో ఉన్న గుర్రం బాపయ్య కల్యాణ మండపం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సేవా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య, ప్రభాకర్‌రాజు, మాధవరాజు, విజయ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలు



పెద్దాస్పత్రిలో అన్నదానం చేస్తున్న రెడ్‌క్రాస్ నాయకులు

నెల్లూరు(అర్బన్): ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం, చలివేంద్రాల ఏర్పాటు కార్యక్రమాలు నిర్వహించారు. దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి)లో రోగుల సహాయకులు, ఔట్‌పేషెంట్లకు అన్నదానం చేశారు. అలాగే మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ జెనెరిక్ మందుల షాపు వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆత్మకూరు బస్టాండ్, మద్రాస్‌బస్టాండ్, రామలింగాపురం అండర్‌బ్రిడ్జి తదితర చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, జనార్దన్‌రాజు, జిల్లా కోఆర్డినేటర్ గంటా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఓటింగ్ ప్రక్రియలో 338 ఓట్లు నమోదు



ఓటు హక్కును వినియోగించుకుని వేలుపై సిరా చూపుతున్న ప్రభుత్వ ఉద్యోగి

నెల్లూరు(బారకాసు): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్ల సౌలభ్యం కోసం నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్ పోస్టల్ ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొత్తం 338 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. మొదటి రోజు మంగళవారం 120 ఓట్లు నమోదు కాగా, రెండో రోజు బుధవారం 218 ఓట్లు నమోదయ్యాయని తెలిపారు. అలాగే స్థానిక నవాబుపేట బీవీఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అత్యవసర సేవల సిబ్బంది పోస్టల్ ఓటింగ్‌లో మొత్తం 16 ఓట్లు నమోదయ్యాయని తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధే వైఎస్సార్‌సీపీ విజయ సోపానాలు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆదాల హిమబిందు

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే ఈ ఎన్నికల్లో ఆ పార్టీ విజయానికి సోపానాలు అని ఆదాల హిమబిందు అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 26, 27 డివిజన్లలో బుధవారం వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి గెలుపు కోసం ఆయన కుమార్తె హిమబిందు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపునకు దోహదపడతాయని తెలిపారు. కేవలం 9 నెలల సమయంలోనే రూరల్ ఇన్‌చార్జిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, 26, 27వ డివిజన్ల ఇన్‌చార్జిలు షేక్ బాబు, సన్నపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి, నాయకులు కొండ్రెడ్డి భరత్‌కుమార్, నగర మహిళా విభాగం అధ్యక్షురాలు కాకుటూరు లక్ష్మీసునంద, ఉపాధ్యక్షులు వేలూరు శ్రీధర్‌రెడ్డి, క్లస్టర్-1 అధ్యక్షుడు ముడియాల రామిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సీహెచ్ సూరిబాబు, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు ముంగమూరు భార్గవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించండి



ఉన్నతాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మాట్లాడుతున్న ఆర్‌ఓ వికాస్‌మర్మత్

- రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో కీలకమైన పోలింగ్ ప్రక్రియను అధికారులంతా సమర్థవంతంగా నిర్వహించాలని నెల్లూరు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్ సూచించారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు, సూపరింటెండెంట్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిబద్ధతతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను పంపిణీ చేసే బృందాలు, ఈవీఎంలు స్వీకరించే బృందాలు సంసిద్ధంగా ఉండి, పోలింగ్ ప్రక్రియను ప్రారంభించాలని ఆర్‌ఓ తెలిపారు. ఈవీఎంల నంబర్లు, ఇతర పత్రాలన్నింటినీ సరిచూసుకుని పంపిణీ చేపట్టాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ విధులు నిర్వహించే బృందాలు తమ విధివిధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సంబంధిత పత్రాల్లో ఏవైనా లోపాలు గుర్తిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఈవీఎంలను విడివిడిగా చేర్చాలని, రూట్ మ్యాప్‌ను ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేసుకుని ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద మెడికల్ క్యాంపులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

అత్యధిక మెజారిటీతో గెలిపించండి



వెంకటేశ్వరపురంలో మహిళల ఎన్నికల ప్రచారం



ఇస్లాంపేటలో నాయకుల ఎన్నికల ప్రచారం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డిని, నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నగరంలోని 53వ డివిజన్ పరిధిలో నల్లకాలువ, పునరావాస కాలనీ, విజయ డెయిరీ, 54వ డివిజన్ పరిధిలోని ఇస్లాంపేట, జనార్దనరెడ్డికాలనీ, పరిసర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంగళరెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు జమీర్‌అహ్మద్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆదాలతోనే రూరల్ అభివృద్ధి సాధ్యం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న స్వర్ణా వెంకయ్య, నాయకులు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధి ఆదాల ప్రభాకర్‌రెడ్డితోనే సాధ్యమని, ఆయన ఎక్కడ ప్రాతినిధ్యం వహించినా ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని రైల్వే బోర్డు సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు స్వర్ణ వెంకయ్య తెలిపారు. రూరల్ నియోజకవర్గంలోని కందమూరు పంచాయతీలో బుధవారం వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి గెలుపు కోసం నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ వెంకయ్య మాట్లాడుతూ గత 9 నెలల్లో ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూరల్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అనేక అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని, రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కందమూరు ఎంపీటీసీ సభ్యుడు గుణపాటి శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసులునాయుడు, రవి, కృష్ణయ్య, రమణయ్య, సుధాకర్, ప్రసాద్, పెంచలయ్య, చెంచురామయ్య, బాబులు తదితరులు పాల్గొన్నారు.